క్లుప్తంగా

రహదారి పనులు పరిశీలన

అశ్వాపురం: మండల కేంద్రంలో తురుముల గూడెం నుంచి అశ్వాపురం రైల్వేస్టేషన్ వరకు రూ.2 కోట్లతో రహదారి, కల్వర్టుల నిర్మాణ పనులను శనివారం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో రైల్వేస్టేషన్ రహదారికి నిధులు మంజూరై పనులు శరవేగంగా సాగుతున్నాయని వైస్ ఎంపీపీ, నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, మైనార్టీ అధ్యక్షుడు షేక్ నయీం, ఇస్లావత్ నాగు, చుంచు రామ్మూర్తి, జూపల్లి కిరణ్, డేవిడ్, గద్దల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించాలి

భద్రాచలంటౌన్: జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటిన ఆదివాసీ క్రీడాకారులను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు గుర్తించి ప్రోత్సాహకాలు అందించాలని, భవిష్యత్‌లో అనేక పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇప్పించాలని ఆధార్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు గొంది వెంకటరమణ అన్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఆదివాసీ యువజన క్రీడా ఉత్సవాల్లో భాగంగా శనివారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధార్ సొసైటీ సమన్వయ నాయకులు పోడియం బాలరాజు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, జయబాబు, కృష్ణ, రవివర్మ, కోచ్‌లు హరికృష్ణ, కృష్ణారావు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా జరిపించారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పూజలు నిర్వహించి, స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో ఆలయ మేనేజర్ రమణ, ఆలయ మాజీ చైర్మన్ బోయినపల్లి పెద్దసుబ్బారావు దంపతులు, వనమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భద్రాచలంఅర్బన్: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెం పట్టణంలో జరిగే ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. భద్రాచలం పట్టణంలో ఏఎంసీ కాలనీ, ఎంపీ కాలనీ, రిక్షా కాలనీ, భగవాన్ దాస్ కాలనీలశాఖల ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం చర్ల రోడ్డులో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నాయని, ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు జక్కం గోపి, డానియల్ ప్రదీప్, బాబురావు, వరరాజు, వెంకట్, వెంకన్న, వలి, అనంత లక్ష్మి, అంజనీ కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వారావుపేటరూరల్: డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న గ్రామ దీపికలకు శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న వీవోఏలకు చిట్టి తల్లి సేవా సమితి బాధ్యులు, నారంవారిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మనుగొండ వెంకట నాగముత్యం(పెద్దోడు) ఆధ్వర్యంలో రూ.10వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఇస్లావత్ నాగేశ్వరరావు, మంగ భాగ్యరాజు, చీమడబోయిన సురేష్, నానిపల్లి సురేష్, రవి, రమేష్, కుప్పల కృష్ణ, వేముల శ్రీను, సత్తెనపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియా నివారణ

మణుగూరురూరల్: చిన్న పిల్లల్లో డయేరియా నివారణ కోసం ఖచ్చితంగా పరిశుభ్రతను పాటించాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. శనివారం పెద్దపల్లి గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐడీసీఎఫ్, విటమిన్ ఏపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెద్దిపల్లి గ్రామంలోని చిన్నారులకు విటమిన్ ఏ ద్రావణం తాగించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. సుమారు ఏడు శాతం మంది పిల్లలు డయేరియాతోనే మరణిస్తున్నారని తెలిపారు. పిల్లల డయేరియా మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఐడీసీఎఫ్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ దయామని, పుష్పారాణి, రాంప్రసాద్, శైలజ, విజయ, రోజా పాల్గొన్నారు.

ఊరంతా ఆకుకూరలే..

- రామానుజవరంలో అధిక మొత్తంలో పెంపకం
- సేంద్రియ పద్ధతిలో సాగు
- తక్కువ ధరకే అమ్మకం
- మక్కువ చూపుతున్న వినియోగదారులు



ఆకుకూరలను పండిస్తున్న ఓ మహిళా రైతు



ఇంటి పెరట్లో పెరుగుతున్న ఆకు కూరలు

మణుగూరురూరల్: మణుగూరు సబ్ డివిజన్‌లో ఆకుకూరల పేరు చెబితే టక్కున గుర్తొచ్చేది మండల పరిధిలోని రామానుజవరం (కొండాయిగూడెం) గ్రామం. నేటి సమాజంలో ఎంతోమంది పెరటి కూరలు, మిద్దెపై ఆకుకూరలు, కూరగాయలు అంటూ సాగు చేస్తున్నారు. కానీ రామానుజవరం గ్రామంలో ప్రతీ ఇంట్లో తమకు ఉన్న కాస్తో కూస్తో భూమిలో తోటకూర, గోంగూర, పాలకూర, బచ్చలికూర, మెంతికూర, చుక్క కూరలను సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. కొంతమంది ఎకరం, అరెకరం భూములను కౌలుకు తీసుకుని ఆకుకూరలను పండిస్తుంటారు. ఇలా సాగు చేసిన ఆకుకూరలను తెల్లవారుజామునే లేచి గంపల్లో, బుట్టలలో, సైకిల్, మోటార్ బండ్లపై ఇంటింటికీ తిరిగి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతుంటారు.

పరిసర ప్రాంతాల్లో డిమాండ్..

ఈ గ్రామంలో పండే ఆకుకూరలకు డిమాండ్ కూడా ఎక్కువే. గత మూడు దశాబ్దాలుగా ఈ గ్రామ ప్రజలు ఆకుకూరల సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మణుగూరు పరిసర ప్రాంతాల ప్రజలకు నిత్యం తాజా ఆకుకూరలను సరఫరా చేస్తూ..ఆర్థికంగా ప్రగతిని సాధిస్తున్నారు. ఏమాత్రం రసాయన ఎరువులను వాడకుండా సేంద్రీయ ఎరువులను మాత్రమే వినియోగించి ఆకుకూరల సేద్యం చేస్తూ... ప్రజారోగ్యానికి ప్రాణం పోస్తున్నారు. వీరి వద్ద మార్కెట్ రేట్ కంటే తక్కువకే ఆకుకూరలు, పలు కూరగాయలు లభ్యమవుతాయి. ఏ రకం ఆకుకూరైనా పండించడానికి ఎకరానికి రూ.10వేల పెట్టుబడి అవసరం కాగా.. పంట మాత్రం 40 రోజుల్లో రైతు చేతికొస్తుంది.

ప్రభుత్వ సహకారానికి వినతి

ఈ ఆకుకూరలను చిన్న, సన్న కారు రైతులకు, చిరు వ్యాపారులకు ప్రధాన ఉపాధిగా మారింది. అయితే, కొన్నిసార్లు చీడపీడలతో జరిగే పంట నష్టానికి రైతు కూడా నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. మూడు దశాబ్దాలుగా పెరటి కూరలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నా.. తమ బతుకుల్లో మార్పు రావడం లేదని ఆ గ్రామ ఆకుకూరల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్పందించి ఆకుకూరల పంట సాగుకు సబ్సిడీ విత్తనాలు, బ్యాంక్ రుణ సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందించాలి



ఆకు కూరలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ.. ఇంటింటికీ తిరిగి అమ్మే పరిస్థితులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. వీటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు నెలల తరబడి ఇంట్లో కూర్చోవాల్సి వస్తుండడంతో ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి.

– మల్లికంటి రమేష్, రైతు, రామానుజవరం

ఆకు కూరలతోనే జీవనోపాధి



ఏళ్లు తరబడి ఆకు కూరలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఆకు కూరల సాగు కష్టమే అయినా తప్పడం లేదు. సాగు సమయంలో భారీ వర్షాలు పడితే నష్టాలే చవిచూస్తున్నాం. రైతుబంధులా ఆకుకూరలు, కూరగాయల సాగు రైతులకు కూడా ప్రభుత్వం సహాయం అందించాలి.

– బొల్లం పెద్దమధర్, రైతు, రామానుజవరం

ప్రోత్సాహం అందించాలి



ఆకుకూరలు, కూరగాయలు పండిస్తూ.. ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. కొన్నిసార్లు తెగుళ్లు, చీడపీడల వల్ల ఆకుకూరల పంట దిగుబడి తగ్గడం, ధర లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆకుకూరల సాగు రైతులకు ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి.

– బాడిశ సతీష్, సర్పంచ్, రామానుజవరం

నాణ్యమైన విత్తనాలనే కొనాలి



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

భద్రాచలంటౌన్: పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు తప్పని సరిగా ప్రభుత్వం ఆమోదిత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఏడీఏ లాల్‌చంద్ తెలిపారు. భద్రాచలం పట్టణంలోని విత్తనాల దుకాణాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, విత్తన టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇన్‌వాయిస్, స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఏడీఏ లాల్‌చంద్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అరికట్టడానికి అగ్రికల్చర్, పోలీస్ సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు డీఏఓ దీపక్, ఏఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

దమ్మపేట: పీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. శనివారం మండల పరిధిలోని గుండె పట్వారిగూడెంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.8 వేలు, మూడో బహుమతిగా రూ.6వేలను అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. యువత క్రీడాల్లో రాణించి, భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయితో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పొంగులేటి అనుచరులు మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, జారే ఆదినారాయణ, కోటగిరి సత్యంబాబు, చిన్నశెట్టి యుగంధర్, రావు రవిశంకర్, యర్రగొర్ల రాధకృష్ణ, పర్వతనేని ప్రసాద్, చక్కిరాల మల్లేశ్వరరావు, గోపిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పొంగులేటి

భద్రాద్రిలో సీఎన్‌జీ బంక్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో మొట్టమొదటి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండో సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్‌ను శనివారం పట్టణంలో ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న శ్రీవాణి ఆటో సర్వీస్ స్టేషన్ వద్ద మేఘా సీఎన్‌జీ ఫిల్లింగ్ స్టేషన్ పేరట ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక నుంచి వాణి ఫిల్లింగ్ స్టేషన్‌లో మోటారు వాహనాలకు అవసరమైన మేఘా గ్యాస్‌ను విక్రయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ యజమానురాలు వాణికుమారి, మేఘా గ్యాస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ వంశి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



భద్రాచలంఅర్బన్: దీక్షలను ప్రారంభిస్తున్న మాజీ డీసీసీబీ చైర్మన్ రవికుమార్

భద్రాచలంఅర్బన్: వీవోఏల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో వీవోఏలు చేపట్టిన నిరసన దీక్షలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 50 డిగ్రీలు ఎండలో కూడా 41 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కారం పుల్లయ్య, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నరసారెడ్డి, వీవోఏల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటలక్ష్మి, చంద్రలీల, సీతారత్నం, జానకి, రమ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 41వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని టీజేఎస్ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 41 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు వీఓఏలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. టీజేఎస్ జిల్లా నాయకులు శనగ పుల్లయ్య, వీవోఏల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీను గోపాల్, మండల అధ్యక్షురాలు సులోచన, మణెమ్మ, రోజా, జరీనా, వరలక్ష్మి, భారతి, లలిత, ధనలక్ష్మి, శ్రీదేవి, అనురాధ, సీత పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళలకు గాయాలు

దమ్మపేట: ఉపాధి హామీ మహిళ కూలీలను ఆటో ఢీకొట్టిన ఘటనలో పలువురు గాయపడ్డారు. మండలంలోని గుర్వాయిగూడెం శివార్లలో శనివారం రోడ్డు పక్కన పని చేస్తున్న ఉపాధిహామీ మహిళా కూలీలను ఆటో ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కూలీలు కుంజా పోలమ్మ, కుంజా లక్ష్మితో పాటు ఆటో డ్రైవర్ కూడా గాయపడ్డారు. దీంతో స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చర్యలు తీసుకోవాలి

చండ్రుగొండ: రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్ శరణ్‌సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు పెద్దిని వేణు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే దేశఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న రెజ్లర్లపై ఒక ఎంపీ వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఆర్ వెంకటాచారి, రాయి రాజా పాల్గొన్నారు.

నేడు విగ్రహ ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: దాతల సహకారంతో నిర్మించిన శివుడి విగ్రహాన్ని నేడు (ఆదివారం) ఆవిష్కరణ చేయనున్నారు. అశ్వారావుపేటలోని గుర్రాల చెరువు మార్గంలోని వైకుంఠ ధామం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

జేఏసీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

ములకలపల్లి: గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మండల అధ్యక్షుడిగా గంటా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో జేఏసీ నూతన మండలకమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చల్లా జయరాజు, కార్యదర్శిగా చిటికె రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా చిక్కుల శ్రీను, కోశాధికారిగా గుగులోతు శంకర్, గౌరవ అధ్యక్షుడిగా మరీదు రామనరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆదివాసీలను అవమానించినట్లే..

దుమ్ముగూడెం: ఈ నెల 28న భారత కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పిలువకపోవడం యావత్ ఆదివాసీ సమాజాన్ని, భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్లం నరేష్ అన్నారు. శనివారం దీనిపై ప్రకటనను విడుదల చేశారు. దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపతి ముర్ము పిలవకపోవడాన్ని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28న అన్ని జిల్లా, రాష్ట్ర హెడ్ క్వార్టర్లలో నిరసన కార్యక్రమాలు భారీ ఎత్తున చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి



పినపాక: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న విప్ రేగా కాంతారావు

పినపాక: వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ రంగానికి పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలు ప్రవేశపెడుతోందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు శనివారం బయ్యారం క్రాస్ రోడ్‌లోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సబ్సిడీకి జీలుగులు, ఇతర విత్తనాలు రైతులకు అందజేశారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఎంపీపీ గుమ్మడి గాంధీ, రైతు సమితి కన్వీనర్ దొడ్డ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

పినపాక: బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారులకు మహర్దశ పట్టిందని, మారుమూల ఆదివాసీ గ్రామాలకు కూడా ఆర్అండ్‌బీ దారులు వచ్చాయని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలో పర్యటించిన ఆయన ఐలాపురం నుంచి చిరుమల్ల, పినపాక నుంచి గడ్డంపల్లి వరకు సుమారు మూడు కోట్లతో నిర్మిస్తున్న బీటీ రహదారులకు రేగా శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, వైసిపి కంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి చేకూరిన లబ్ధి..

కరకగూడెం: సీఎం కేసీఆర్ నేతృత్వంలో, బీఆర్ఎస్ పాలనలో గడిచిన 9 సంవత్సరాల్లో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శనివారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత వట్టంవారి గుంపు, అరెంవారి గుంపు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, కరకగూడెం నుంచి చిరుమళ్ల వరకు రూ.2.91 కోట్ల వ్యయంతో ఫ్లడ్ డ్యామేజి, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే మోతె గ్రామంలో పెద్దవాగుపై రూ. 4.5 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి, ముక్కటి ఒర్రెపై రూ.2.57 కోట్లతో నిర్మించిన బ్రిడ్జితో పాటు, గొల్లగూడెం–కొత్తూరు గ్రామాల మధ్యగల వట్టివాగుపై రూ.1.27 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు అనేక నిధులు కేటాయిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక, పలుశాఖల అధికారులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన..

మణుగూరురూరల్: మణుగూరు ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆస్పత్రిని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శనివారం సందర్శించి ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని గ్రావెల్‌తో చదును చేయించారు. మణుగూరు సబ్ డివిజన్ ప్రజలందరికీ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఔట్‌పోస్ట్‌కు స్థల పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటుకు శనివారం ఎస్సై జితేందర్ ఆధ్వర్యంలో స్థలం పరిశీలించారు. మండలంలో అశ్వాపురం తర్వాత అనేక గ్రామాలకు కూడలిగా ఉన్న మొండికుంట గ్రామంలో ఇటీవల వరుస దొంగతనాలు, గొడవలు జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుకు పోలీసులు దృష్టి సారించారు. ఈ ఔట్ పోస్టులో 24 గంటలు ప్రజలకు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారు. దీనివల్ల దొంగతనాలు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయి.



మొండికుంటలో పోలీస్ ఔట్‌పోస్ట్‌కు స్థలం పరిశీలిస్తున్న ఎస్సై జితేందర్

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును, ఆయన నివాసంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఐటీడీఏ డీఈ రామిరెడ్డి, ఏఈ ప్రసాద్‌లు మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను కలసి పలు అభివృద్ధి పనుల వ్యయానికి సంబంధించిన అంచనాలను ఎమ్మెల్యేకు అందజేసి, సమగ్రంగా వివరించారు. అశ్వారావుపేట మండల పరిధిలోని గుమ్మడివల్లి గ్రామంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాల సైడ్ డ్రెయినేజీ, దమ్మపేట గ్రామ శివారులోని నెమలిపేట కాలనీకు అప్రోచ్ వంతెనల నిర్మాణాలకు అయ్యే వ్యయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఐటీడీఏ పనుల పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

రోలింగ్ డ్రమ్ములు పంపిణీ

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామ శివారు మంగళబోడు నివాసముంటున్న ఆదివాసీ గొత్తికోయలకు శనివారం తాగునీటి సదుపాయం కోసం రోలింగ్ డ్రమ్ములు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు డ్రమ్ములు పంపిణీ చేసినట్లు సెక్రటరీ కె.కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్దం వినోద్, వార్డు సభ్యుడు పి.నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దమ్మపేట: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మందలపల్లి క్రాస్ రోడ్‌లో ఎస్సై వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టుబడింది. వ్యాన్‌లో 520 కేజీల రేషన్ బియ్యం ఉంది. తరలిస్తున్న కన్నాటి చిలకమ్మ, కోటా సురేష్ బాబులపై కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిన నాయకులు

మణుగూరురూరల్: ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ మార్చ్‌కు మణుగూరు నుంచి బీజేపీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాడి దేవేంద్ర వరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భిక్షపతి, సరస్వతి, లింగంపల్లి రమేష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో జరిగిన నిరుద్యోగ మార్చ్‌కు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఐకార్ మెంబర్, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నిరుద్యోగ మార్చ్‌కు వెళ్లిన వారిలో పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాడిదేవేంద్ర ప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, మండల అధ్యక్షుడు తాటి పాముల అయిలయ్య, సురకంటి లింగారెడ్డి, కొల్లు లింగారెడ్డి, చిర్రా సరస్వతి, రవీందర్, తారా ప్రసాద్, కృష్ణకుమారి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాకేంద్రం కొత్తగూడెం నిర్వహించతలపెట్టిన పోడు భరోసా ర్యాలీకి శనివారం ఆయన వర్గం నేతలు తరలివెళ్లారు. కార్లు, ఆటోల్లో పెద్ద ఎత్తున పోడు దారులను తరలించారు. తొలుత జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. తరలివెళ్లిన వారిలో భోజ్యానాయక్, ఎంపీపీ బాణోత్ పార్వతి, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కిరణ్‌రెడ్డి, సారేపల్లి శేఖర్, బాణోత్ రాముడు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

దారిని కమ్మేశాయి..



మండలంలోని ఆసుపాక నుంచి నారాయణపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని కల్వర్టు దగ్గర ముళ్ల చెట్లు దారిని కమ్మేశాయి. ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు రహదారిని సగానికి మూసి వేసి, ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళలో దగ్గరకు వచ్చే వరకు ఆ ముళ్ల చెట్లు, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే వాటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు. – అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: రామిశెట్టి శ్రీనివాసరావు, ఏఈ, ఆర్‌అండ్‌బీ, అశ్వారావుపేట
ఫోన్ నంబర్: 83091 62728